# ఉద్యమకారుల ఆగ్రహ జ్వాల

**ప్రజాభవన్ ముట్టడితో ప్రభుత్వానికి హెచ్చరిక -"హామీలు అమలు చేయకపోతే జూన్ 2 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు"**





**ఖమ్మం/, మే 15 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారులు శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌ను ముట్టడించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన ఉద్యమకారులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పలు జిల్లాల్లో ఉద్యమకారులను ముందస్తు అరెస్టులు చేసి అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ, వాటిని లెక్కచేయకుండా ప్రజాభవన్ వద్దకు చేరుకున్న ఉద్యమకారులు నినాదాలతో హోరెత్తించారు. "ఉద్యమకారులకు న్యాయం చేయాలి", "ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి" అంటూ ప్రభుత్వానికి గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు.

ఉద్రిక్త పరిస్థితుల మధ్య రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను ప్రజాపాలనలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారి చిన్నారెడ్డి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రికి లేఖ పంపించారు. అనంతరం ఉద్యమకారుల ప్రతినిధులను ప్రత్యేకంగా సెక్రటేరియట్‌కు తీసుకెళ్లి శేషాద్రితో సమావేశం ఏర్పాటు చేశారు.

సమావేశంలో ఉద్యమకారుల ఆవేదనను విన్న శేషాద్రి, ఈ సమస్య ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో ఉందని తెలిపినట్లు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి. కృష్ణారావు వెల్లడించారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించేందుకు వారం రోజుల్లో కమిటీ ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అయితే హామీలతో సరిపెట్టకుండా స్పష్టమైన చర్యలు కనిపించాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. జూన్ 2లోపు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, బచ్చల పద్మాచారి, కేలోత్ రవిచంద్ర చౌహాన్, మొతుకురి వెంకటాచారి, గాజుల రవికుమార్, ఉపేందర్, రెడ్డబోయిన వరలక్ష్మి, కామని అనంతలక్ష్మి, నల్లా స్వరూప, ధనలక్ష్మి, కమలమ్మ, ఆకారపు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ బడుల బాటలో గ్రామాల జోష్

**ఇంటింటికీ తిరిగి విద్యార్థుల చేరికలపై అవగాహన**




**ఎల్కతుర్తి,/ మే 16 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఎల్కతుర్తి మండలంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కింద మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రత్యేక ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బావుపేట, తిమ్మాపూర్, ఎల్కతుర్తి, దామెర గ్రామాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి బడిబాట ర్యాలీలతో సందడి చేశారు. గ్రామ వీధుల్లో నినాదాలతో సాగిన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్, బావుపేట పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు ఎల్.మనోహర్ నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాల గురించి వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వరయ్య చారి, శ్రీధర్, సునీత, మర్రి రవికుమార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ మొగిలయ్యతో పాటు గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# ప్రాణాలతో పోరాడుతున్న యువకుడు

**చికిత్సకు రూ.6 లక్షలు అవసరం**

**దాతల సహాయం కోసం కుటుంబం వేడుకోలు**

**తల్లాడ/మే 15, (జర్నలిస్ట్ వార్త)**



మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీకి చెందిన సంగసాని పార్థు(18) ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతూ జీవన్మరణ పోరాటం చేస్తున్నాడు. సంగసాని నరసింహారావు కుమారుడైన పార్థు అనారోగ్యానికి గురికావడంతో ఖమ్మంలోని యలమద్ది ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల్లో మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే మెడ నాళంలో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే హైదరాబాద్‌లోని మెరుగైన ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆలస్యం చేస్తే ప్రాణాపాయం తప్పదని, ఇప్పటికే బ్రెయిన్‌పై ప్రభావం చూపడంతో చేతులు, కాళ్లు పనిచేయడం లేదని వైద్యులు చెప్పినట్లు వెల్లడించారు. ఇప్పటికే చికిత్స కోసం రూ.50 వేల వరకు ఖర్చు కాగా, ఆపరేషన్ మరియు తదుపరి వైద్యం కోసం దాదాపు రూ.6 లక్షలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు వాపోయారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన పార్థు చికిత్స ఖర్చులు భరించే స్థితిలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. పార్థు ప్రాణాలు కాపాడేందుకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు చేతులెత్తి వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకునే వారు సంగసాని చందు ఫోన్‌పే నంబర్ 8309515263కు పంపించాలని కోరారు. అలాగే ఈ సమాచారాన్ని సోషల్ మీడియాలో విస్తృతంగా పంచి తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# అరెస్టులతో ఉద్యమాలు ఆగవు

**తెగించి కొట్లాడిందే తెలంగాణ -ప్రభుత్వానికి నిమ్మల మనోహర్ హెచ్చరిక**

**ఎల్కతుర్తి,/మే 15( జర్నలిస్ట్ వార్త)**
అరెస్టు వారెంట్లు, పోలీసు నిర్బంధాలతో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అణిచివేయలేరని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్ హెచ్చరించారు. తెగించి పోరాడి సాధించుకున్న తెలంగాణ చరిత్రను ఎవరూ చెరిపేయలేరన్నారు. రాష్ట్రంలో హక్కుల కోసం ఉద్యమాలు జరుగుతున్న సమయంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడి కార్యక్రమానికి ముందస్తుగా ఉద్యమకారులను అరెస్టు చేయడం దుర్మార్గమని విమర్శించారు. మండల స్థాయి నాయకుల నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యమ నాయకులు, మహిళా నాయకురాళ్ల వరకు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. అరెస్టు వారెంట్లతో ఉద్యమాలను ఆపగలమని ప్రభుత్వం భావిస్తే అది భ్రమేనని అన్నారు.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే నెలలో నాలుగు సార్లైనా ఆందోళనలు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను విస్తరింపజేస్తామని నిమ్మల మనోహర్ హెచ్చరించారు.



# ఉపాధి హామీపై కేంద్రం కుట్రలు

**పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఉద్యమాలు తప్పవు**

**బీకేఎంయూ నేతల హెచ్చరిక**



**ఎల్కతుర్తి,/ మే 15( జర్నలిస్ట్ వార్త)**గ్రామీణ పేదలకు అండగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని బీకేఎంయూ (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం) జిల్లా నాయకత్వం ఆరోపించింది. పథకాన్ని బలహీనపరిచే కొత్త చట్టాల పేరుతో పేదల ఉపాధి హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని మండిపడింది. శుక్రవారం మండలంలోని దామెర, చింతలపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సంఘం నాయకులు పరిశీలించారు. పనుల్లో పాల్గొంటున్న కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రతలో పని చేస్తున్నా కనీస వేతనం అందడం లేదని, పని ప్రదేశాల్లో నీడ, మంచినీటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోయారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.362 దినకూలి ఎక్కడా అమలు కావడం లేదని, చాలా చోట్ల రూ.300 కూడా రావడం లేదని తెలిపారు. సమ్మర్ అలవెన్సులు, ఇతర భత్యాలు చెల్లించడం లేదని, పని అడిగితే పనుల్లేవంటూ అధికారులు తిరస్కరిస్తున్నారని కూలీలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మునిగొండ బిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకటరాజం, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ మాట్లాడుతూ.. పేదల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని బీజేపీ ప్రభుత్వం ఎప్పటి నుంచో చూస్తోందని విమర్శించారు. మూడోసారి అధికారంలోకి రాగానే పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు దిగిందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించడంతో పాటు మరింత సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలకు కనీస వేతనం, సమ్మర్ అలవెన్సులు అందేలా చూడాలని కోరారు. ఉపాధి హామీ సమస్యలపై గ్రామీణ పేదలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి ఊటుకూరు రాములు, సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, నాయకులు తండ మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

**పోక్సో కేసును నీరుగార్చే యత్నం చేస్తున్నారని సిపిఐ ఆరోపణ**

**హనుమకొండ కాళోజీ సెంటర్‌లో రాస్తారోకో**

**హనుమకొండ, బ్యూరో మే 15 (జర్నలిస్ట్ వార్త):**
పోక్సో కేసులో తన కుమారుడిని రక్షించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన.. ఇటీవల 17 ఏళ్ల మైనర్ బాలికపై బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్ మద్యం తాగించి, డ్రగ్స్ ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదైన తర్వాత కూడా అధికార ప్రభావంతో దర్యాప్తును మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ పోలీసు వ్యవస్థపై ప్రభావం చూపుతూ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసుపై నిష్పక్షపాత విచారణ జరగాలంటే వెంటనే ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి. విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్.ఏ. స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, అలువాల రాజు తదితరులు పాల్గొన్నారు.






